DD9 వార్త
తెలుగు దినపత్రిక
శనివారం, సెప్టెంబర్ 13, 2025



- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా కాసుల వేట
- అక్రమ వసూళ్ల మాటున కార్పోరేటర్ ల బరితెగింపు
- అక్రమ కట్టడాలేలక్ష్యంగా లక్షల్లో గుంజుతున్నారు
- ఇంటి ముందు ఇసుక పోస్తే గద్దల్లా వాలిపోతారు
- ఎమ్మెల్యే వద్దన్నా వసూళ్లు మానడం లేదు
- అవినీతి కార్పొరేటర్లకు మున్సిపల్ అధికారుల వత్తాసు
- కాప్రాల్లో అడ్డు అదుపు లేని వసూళ్ల దందా

# కార్పొరేటర్లా.. కలెక్షన్ కింగ్స్



కాప్రా సర్కిల్లో బీఆర్ఎస్ పార్టీ వసూళ్ల అరాచకం

అడ్డదారి వ్యవహారాలను అనుకూలంగా మార్చుకుంటూ దొడ్డిదారి సంపాదనకై బరితెగింపు చర్యలకు పాల్పడుతున్న కొందరు కార్పొరేటర్ల వ్యవహార శైలి కారు పార్టీకి చెడ్డ పేరు తీస్తోంది. నిత్యం కలెక్షన్ల వేటలో ఉండే ఆ కార్పొరేటర్లు అక్రమ నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని తమ వసూళ్ల దందాను కొనసాగించుకుంటూ పోతున్నారు. కార్పొరేటర్ల మనే పేరుతో తాము ఏది చెప్తే అది నడవాలనే అహంకారంతో పూర్తిగా అనైతికంగా వ్యవహరిస్తూ పోతున్న వీరి చర్యలు కారణంగా బి ఆర్ ఎస్ పార్టీ బజార్లో పడుతుంది. అక్కడి ఎమ్మెల్యే మాటలను సైతం ధిక్కరిస్తూ కార్పొరేటర్లు చేస్తున్న దుర్మార్గపు చర్యలు ఆ నియోజకవర్గంలో పార్టీని భ్రష్టు పట్టించే స్థాయికి వెళుతున్నాయి. అయినా సరే అడ్డదారి వసూళ్లకు అలవాటు పడిన ఈ అక్రమార్కులు ఎక్కడ అక్రమ కట్టడం నిర్మించిన అక్కడ ప్రత్యక్షమవుతుంటారు. నిర్మాణదారుల లోపాలను ఆసరాగా తీసుకొని వారిని బెదిరిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పోతున్నారు. మున్సిపల్ అధికారులు కార్పొరేటర్లు ఒక ముఠాగా ఏర్పడి ఒక పద్ధతి ప్రకారం కలెక్షన్ల వేట సాగిస్తున్నారని ఆరోపణ తీవ్రంగా వినిపిస్తున్నాయి నైతిక విలువలను పూర్తిగా వదిలేసిన సదరు కార్పొరేటర్లు అనైతిక చర్యలకు పాల్పడుతూ విమర్శల పాలవుతున్నారు. అయినా సరే సంపాదనే పరమావధిగా భావిస్తున్న వారు ప్రజా వ్యతిరేకతను పెద్దగా పట్టించుకోవడం లేదు. ఉన్నంతకాలం అవకాశం మేరకు దోచుకోవడమే పనిగా పెట్టుకొని పని కట్టుకొని మరి వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు


- డిడి 9 వార్త, హైదరాబాద్

2 లో

## గిరిజన అభివృద్ధి 2047

- భద్రాద్రి ఐటీడీఏ కృషి
- జాతీయ సదస్సులో ప్రత్యేక ప్రాధాన్యం
- జాతీయ సదస్సులో పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి

5 లో



## యాకుత్‌పురా ఘటనకు బాధ్యులపై హైడ్రా చర్యలు

- డీఆర్ ఎఫ్ సిబ్బందికి డిమోషన్
- మెట్ టీమ్ సభ్యుల తొలగింపు

6 లో

## మేనత్తను గొడ్డలితో నరికి చంపిన వ్యక్తి అరెస్ట్

డబ్బులు, బంగారం కోసమే హత్య.. 24 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు

- నిందితుని వివరాలు వెల్లడించిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం
- అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ముందు నిందితుడి హాజరు

5 లో

## పోడు భూముల సమస్యపై సీపీఐ పోరాటం

- వందలాది మందితో ఐటీడీఏకు పాదయాత్ర, వినతిపత్రం అందజేత.
- గిరిజనులపై అటవీ అధికారుల దాడులు, అక్రమ కేసులను ఆపాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా




3 లో







# కార్పొరేటర్లా.. కలెక్షన్ కింగ్సా

## కాప్రా సర్కిల్లో బిఆర్ఎస్ పార్టీ వసూళ్ల అరాచకం

- ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా కాసుల వేట
- అక్రమ వసూళ్ల మాటు న కార్పోరేటర్ ల బరితెగింపు
- అక్రమ కట్టడాలేలక్ష్యంగా లక్షల్లో గుంజుతున్నారు
- ఇంటి ముందు ఇసుక పోస్తే గద్దల్లా వాలిపోతారు
- ఎమ్మెల్యే వద్దన్నా వసూళ్లు మానడం లేదు
- అవినీతి కార్పొరేటర్లకు మున్సిపల్ అధికారుల వత్తాసు
- కాప్రాల్లో అడ్డు అదుపు లేని వసూళ్ల దందా

**డిడి 9వార్త హైదరాబాద్ :** మున్సిపల్ అధికారులు కార్పొరేటర్లు కొమ్ముకై అక్రమ నిర్మాణ దారుల నుండి అడ్డగోలుగా వసూలు చేస్తున్న వ్యవహారాలపై పట్టించుకునే వారు లేకపోవడంతో కాప్రా సర్కిల్ పరిధిలోని అనైతిక దందా కొనసాగుతోంది. కాప్రా పరిధిలో ఎక్కడ చూసినా నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా సాగుతున్న నిర్మాణాలను నియంత్రించాల్సిన మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోగా అక్రమాలను తమ అనుకూలంగా మార్చుకుంటూ దండిగా వసూలు చేస్తున్నారు. కార్పొరేటర్లతో కలిసి అడ్డగోలు నిర్మాణాలను లక్ష్యంగా చేసుకొని లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్న ఈ అవినీతి ముఠా బరితెగింపు ధోరణితో వ్యవహరిస్తోంది.

### 6 వార్డులో అడ్డగోలు నిర్మాణం

కాప్రా సర్కిల్ పరిధిలోని మల్లాపూర్ నాచారం 6వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా వైభవ్ హోటల్ వెనుక ఆనుకుని సాగుతున్న అక్రమ నిర్మాణం పై అటు మున్సిపల్ అధికారులు,ఇటు కార్పొరేటర్లు ఆర్థికపరమైన ఒప్పందాల నేపథ్యంలో పట్టించుకోవడం లేదు,అనుమతులు లేకపోయినా ఐదు అంతస్తుల నిర్మాణాలతో పాటు సెల్లార్ లు చేపట్టిన... కనీసం సెట్ బ్యాగ్స్ ,ఫైర్ అనుమతులు కూడా లేకుండా నిర్మాణదారులు చేస్తున్న అడ్డగోలు దందాను తమ ఆర్థికపరమైన లాభాలకు అనుకూలంగా మార్చుకున్నారు. అనుమతి లేకుండానే అంత పెద్ద స్థాయిలో కట్టడం జరుగుతుంటే మున్సిపల్ శాఖలోని ఉన్నత అధికారులు సైతం మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల వ్యవహారంలో వసూళ్లు అనే ఒకే ఒక ఫార్ములాను అనుసరిస్తూ అటు కార్పొరేటర్లు ఇటు మునిసిపల్ అధికారులు దండిగానే దండుకుంటున్నారు, లక్షల్లో అధికారులు జేబుల్లో వేసుకుంటున్నారు. వ్యక్తిగతంగా వారు లబ్ధి పొందుతూ ప్రభుత్వ ఖజానాకు మాత్రం కన్నం వేస్తున్నారు.

### 4 వార్డులోనూ అదే తంతు

మీర్పేట్ హెచ్.పీ కాలనీ వార్డు నెంబర్ 4 లో కూడా ఇదే తంతు సాగుతోంది. ఇక్కడ విఎన్ఆర్ గార్డెన్స్ ఎదురుగా, నోమ టాకీస్ పక్కన ఐదంతస్తుల అక్రమ నిర్మాణం సాగుతోంది. సెట్ బాగ్స్ లేకుండా నే పరిమితికి మించి అనుమతులకు దూరంగా నిర్మిస్తున్న ఈ భవనానికి సంబంధించి భారీగానే ముడుపులు చేతులు మారినట్లుగా తెలుస్తుంది. అందుకే ఈ కట్టడాల వైపు అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు. జి ప్లస్ వన్ కు అనుమతులు ఉంటే కాప్రా సర్కిల్ పరిధిలో అంతస్తుపై అంతస్తులు నిర్మిస్తున్న అధికారులు చోద్యం చూడడం వెనక లక్షల్లో ముడుపులు స్వీకరించడమే కారణమని తెలు స్తుంది. య దేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణ వ్యవహారంలో జోనల్ కమిషనర్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వెనక వాటాలు చేతులు మారి ఉంటాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి, ప్రధాన రహదారుల వెంబడి తీసుకున్న అనుమతులకు పూర్తిగా విరుద్ధంగా ఐదేసి ఫ్లోర్లు నిర్మాణాలు జరుగుతున్న జోనల్ కమిషనర్ నిద్రపోతున్నారా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇదేం అన్యాయం అంటూ మున్సిపల్ అధికారులను





### ఎమ్మెల్యే గారు ఇదేం అన్యాయం

నిర్మాణదారుల నుండి అక్రమ వసూలు చేయవద్దని ఎవరిని బెదిరించవద్దంటూ స్థానిక ఎమ్మెల్యే బహిరంగంగానే తమ అనుచరులకు కార్పొరేటర్లకు స్పష్టంగా చెప్పడం జరిగింది. అయినా సరే కార్పొరేటర్లు ఎమ్మెల్యే మాటను కనీసం పరిగణలోకి తీసుకోకుండా అక్రమ వసూళ్ల దందాకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే చెప్పినంత మాత్రాన తమ స్వలాభాలను ఏమాత్రం వదులుకునేందుకు కార్పొరేటర్లు సిద్ధంగా లేనేలేరని అర్థమవుతుంది. కార్పొరేటర్ల వ్యక్తిగత స్వలాభం కోసం సాగిస్తున్న అవినీతి వసూళ్ల కారణంగా పార్టీ పరువు బదనాం అవుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే వ్యవహారంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది.ఆ పార్టీ నేతలు చేస్తున్న కలెక్షన్ దందాపై ఆయన మౌనంగా ఉంటే ప్రజాక్షేత్రంలో పార్టీకి చెడ్డ పేరు పూర్తిస్థాయిలో వచ్చే అవకాశం ఉంది,ఇప్పటికే కార్పొరేటర్ తీరుపై ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో పార్టీకి ప్రతికూల పరిస్థితులు ఏర్పడే అవకాశాలు లేకపోలేదు. వసూళ్ల దందాపై ఎమ్మెల్యే ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం










# పోడు భూముల సమస్యపై సీపీఐ పోరాటం

- **వందలాది మందితో ఐటీడీఏకు పాదయాత్ర, వినతిపత్రం అందజేత.**
- **గిరిజనులపై అటవీ అధికారుల దాడులు, అక్రమ కేసులను ఆపాలి - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**

**భద్రాచలం సెప్టెంబర్ 12 డిడి9 వార్త:**

పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని, గిరిజనులపై అటవీ అధికారుల దాడులు, అక్రమ కేసులను ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ నుండి భద్రాచలం ఐటీడీఏ వరకు వందలాది



మంది గిరిజనులతో కలిసి ఆయన 10 కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, అటవీ హక్కుల చట్టం ప్రకారం పోడు వ్యవసాయం చేసుకుంటున్న ఆదివాసీలను అటవీ అధికారులు వేధిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా బూర్గంపాడు మండలం వలస గ్రామాలకు చెందిన గిరిజనులు 2005కు ముందు నుంచే సాగు చేసుకుంటున్న పత్తి చేలను ధ్వంసం చేయడం, మహిళలపై దాడులు చేయడం అన్యాయమని అన్నారు. పాత పోడు భూముల్లోనే వ్యవసాయం చేస్తున్నారని, కొత్తగా ఒక్క చెట్టును కూడా నరకలేదని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

జిల్లాలో ఇంకా పెండింగ్‌లో ఉన్న 90 వేల ఎకరాల పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలి. ఇందులో 40 వేల ఎకరాలకు పైగా ఆదివాసీలకు ఇవ్వాల్సి ఉంది. గిరిజన రైతులపై అటవీ అధికారులు చేస్తున్న దాడులు, అక్రమ కేసులను నిలిపివేయాలి. వలస ఆదివాసీ గ్రామాల పిల్లలకు కుల ధృవీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలి. పోడు పట్టాలు పొందిన వారికి రైతు భరోసా, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. ఆదివాసీ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి.

**ఐటీడీఏ పీఓకు వినతి:**

ఐటీడీఏ పీఓ రాహుల్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో, సాబీర్ పాషా ఫోన్‌లో ఆయనతో మాట్లాడి సమస్యలను వివరించారు. దీనిపై పీఓ సానుకూలంగా స్పందించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ పరిపాలనాధికారి సున్నం రాంబాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముావ్వా వెంకటేశ్వర్లు, ముక్కాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, రావులపల్లి రవికుమార్, నరెడ్డి వుల్లారెడ్డి, మున్నా లక్ష్మీకుమారి, ఈనంశెట్టి పూర్ణచంద్రరావుతో పాటు పలువురు సీపీఐ నాయకులు, వందలాది మంది గిరిజనులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ నాయకులు హెచ్చరించారు.

# వెంకట్రావు వైఖరిపై బారాసా నేతల ఆగ్రహం

- **బిఆర్ఎస్ పార్టీలోనే ఉన్నాననడం సిగ్గుచేటు.**

**భద్రాచలం సెప్టెంబర్ 12 డిడి9 వార్త :**

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరలేదని చెప్పడంపై బారాసా (భారత రాష్ట్ర సమితి) సీనియర్ నేతలు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారాసా కార్యకర్తల కష్టంపై కారు గుర్తుతో గెలిచి, ఇప్పుడు పార్టీ మారలేదని చెప్పడం సిగ్గుచేటని వారు మండిపడ్డారు. వెంకట్రావు పార్టీ మారుతున్నారని వచ్చిన వార్తలపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. పార్లమెంటు ఎన్నికలకు ముందే ఎమ్మెల్యే వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరిన మాట వాస్తవమని బారాసా నేతలు పేర్కొన్నారు. పార్లమెంట్ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపు కోసం ఆయన ప్రచారం కూడా చేశారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది వాస్తవం కాదా అని



ప్రశ్నించారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించి వేయించింది కూడా వాస్తవమేనని వారు తెలిపారు. ఇవన్నీ మరిచిపోయి పదవి పోతుందనే భయంతో తాను బారాసా పార్టీలోనే ఉన్నానని, కాంగ్రెస్ పార్టీలో చేరలేదని వెంకట్రావు చెప్పడం ఆశ్చర్యకరంగా ఉందని బారాసా నేతలు అన్నారు. పార్టీ సభ్యత్వం రద్దు కాలేదని, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకోలేదని చెప్పినప్పటికీ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్యతో కలిసి నడుస్తానని చెప్పడం ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావు నిజంగా బారాసా పార్టీలో కొనసాగితే, అంబేద్కర్ సెంటర్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయానికి వచ్చి సాధారణంగా స్వాగతం స్వీకరించాలని నేతలు విజ్ఞప్తి చేశారు. అలా కాని పక్షంలో బారాసా కార్యకర్తలే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కి వచ్చి స్వాగతం పలుకుతారని, అప్పుడు కనీసం బారాసా కండువా అయినా కప్పుకోవాలని వారు కోరారు. ఈ ప్రకటన విడుదల చేసిన వారిలో మండల పార్టీ కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్, కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, సీనియర్ నాయకులు కొల్లం జయ ప్రేమ కుమార్, కోలారాజు, బత్తుల నరసింహులు, సోషల్ మీడియా అధ్యక్షులు ఇమంది నాగేశ్వరరావు, రావూరి రవి కిరణ్, కొలిపాక శివ, గోసుల వెంకట శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# ఫ్లడ్ కెనాల్ ని పరిశీలించిన కాంగ్రెస్ నేతలు..

**వాజేడు,సెప్టెంబర్12,(డిడి9 వార్త):**

పాలెం వాగు ఫ్లడ్ కెనాల్ ను శుక్రవారం కాంగ్రెస్ నేతలు వాజేడు లోని ఆరు గుంట పల్లి వద్ద పరిశీలించారు. వెంకటాపురం మండలం పాలెం వాగు కెనాల్ ను వాజేడు మండలం లోని అరుగుంటపల్లి నుండి కొత్తచెరువు కి మలిస్తే మూడు గ్రామాల గిరిజన రైతులకు సుమారు 1000 ఎకరాల సాగుకు నీరు ఉపయోగపడుతుందని నేతలు అన్నారు. దీనికి ప్రభుత్వం నుండి కోటి రూపాయలు మంజూరు చేయించడానికి భద్రాచలం ఎమ్మెల్యే దృష్టికి నేతలు తీసుకెళ్లన్నట్లుగా తెలిపారు. మూడు గిరిజన గ్రామాల రైతులకు ఈ కెనాల్ ద్వారా నీరు రైతుల పంటలకు నష్టం కలగకుండా కాపాడవచ్చు అని నేతలు స్పష్టం చేశారు. అధికారులు దీనిపై దృష్టి సారిస్తే తక్కువ మొత్తంతో ఎక్కువ ఎక్కువమంది రైతులకు సాగు చేసుకోవడానికి ఉపయోగపడుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్, శ్రీరాముల రమేష్, పశువుల లక్ష్మణ్, చిట్టెం గాంధీ,,కోరం నర్సయ్య, తుమ్మ చందద్రావు,తుమ్మ వేణు,చింత శ్రీరాములు తదితరులు ఉన్నారు




# గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలి

- **కలెక్టర్ సర్క్యూలర్ ప్రకారం జీతాలు చెల్లించాలి**
- **డైలివేజ్ వర్కర్స్ యూనియన్స్ జేఏసీ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె ప్రారంభం.**

**వెంకటాపురం (నూగురు)సెప్టెంబర్ 12 (డిడి9 వార్త ):**

గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, జీతాలు తగ్గిస్తూ ఇచ్చిన జీవో నెంబర్ 64ను వెంటనే రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే కలెక్టర్ సర్కులర్ ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఆరు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్స్ రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు వెంకటాపురం మండలం లో లక్ష్మీ నగరం, చిరుతపల్లి, , హాస్టల్ ముందు నిరవధిక సమ్మె సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసు ప్రారంభించి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అయినా వేతనాలు పెంచుతుందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు తగ్గించే విధంగా నిర్ణయాలు చేసి గిరిజన కార్మికులకు అన్యాయం చేస్తుందని అన్నారు. గత 30 సంవత్సరాలుగా లేని ఆంక్షలు ఇప్పుడు ఆర్థిక శాఖ పేరుతో ప్రభుత్వం వేతనాలు తగ్గింపుకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఆరు నెలల వేతనాలను జిల్లా కలెక్టర్ గెజిట్ ఆధారంగా చెల్లించే విధంగా ట్రెజరీలకు మార్గదర్శకాలను విడుదల చేయాలని అన్నారు. మరణించిన డైలీ వేజ్ వర్కర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు డైలీ వేజ్ వర్కర్ పోస్టు ఇవ్వాలని 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం మరియు ఐదు లక్షల రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ , అంత్యక్రియలు ఖర్చు 50000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారాంతపు సెలవులు, రెండు జతల యూనిఫామ్ బట్టలతోపాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు

# భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- **విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు - ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్.**

**భద్రాచలం, సెప్టెంబర్ 12 డిడి9 వార్త**

భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 15, 16 తేదీలలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జాన్ మిల్టన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ లేదా తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చని ఆయన అన్నారు. అర్హత గల విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు దోస్త్ ఇన్‌చార్జి డాక్టర్ ఎ. శ్రీనును 9291491507 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.







# భద్రాచలం ఆర్టీసీ డ్రైవర్ల ఆందోళన ఐదో రోజుకు చేరింది

- **డిపో మేనేజర్ ఒంటెద్దు పోకడలపై కార్మికుల ఆగ్రహం.**
- **కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ -**
- **సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా**

**భద్రాచలం సెప్టెంబర్ 12 ( డిడి9 వార్త):**

భద్రాచలం ఆర్టీసీ డిపోలో టీం డ్రైవర్లపై అధిక పని భారం మోపుతున్నారని, డిపో మేనేజర్ తిరుపతి ఒంటెద్దు పోకడలకు నిరసనగా గత ఐదు రోజులుగా సుమారు 60 మంది కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

**అధిక పని భారంపై ఆవేదన:**

ఎంప్లాయిస్ యూనియన్ ఎస్.డబ్ల్యు.ఎఫ్., ఐ.ఎన్.టి.యు.సి., టి.ఎం.యు.ల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆందోళనలో కార్మికులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. రీజియన్‌లోని ఇతర డిపోలలో లేని విధంగా భద్రాచలం డిపోలో టీం డ్రైవర్లకు అధిక పని భారం మోపుతున్నారని, వారానికి 1,850 కిలోమీటర్లు డ్రైవ్ చేయాల్సి వస్తుందని ఆరోపించారు. భద్రాచలం నుండి హైదరాబాద్ వంటి సుదూర సర్వీసులలో డ్రైవర్లు నరకయాతన అనుభవిస్తున్నారని తెలిపారు.

**డ్రైవర్ల ప్రాణాలతో చెలగాటం:**

వాటర్ బాటిల్స్ అందించడం, కార్గో పార్శిళ్లు, టికెట్లు ఇవ్వడం వంటి అదనపు పనులతో పాటు కేవలం 7 గంటల్లోనే హైదరాబాద్ చేరుకోవాలని డిపో మేనేజర్ నిబంధనలు పెడుతున్నారని కార్మికులు ఆరోపించారు. దీనివల్ల డ్రైవర్లు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారని, గతంలో కొందరు డ్రైవర్లు విధి నిర్వహణలో అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలయ్యారని చెప్పారు. డిపో మేనేజర్ ఆర్థిక లాభాలకు కక్కుర్తి పడి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, అర్హత లేని ఔట్ సోర్సింగ్ డ్రైవర్లతో హైదరాబాద్ సర్వీసులను నడిపిస్తున్నారని ఆరోపించారు. డీలక్స్, సూపర్ డీలక్స్ వంటి సర్వీసులను నడపడానికి వీరికి అనుమతి లేదని కార్మికులు పేర్కొన్నారు. అప్పుడే ఇన్‌కమింగ్ అయిన డ్రైవర్లను కూడా లాంగ్ సర్వీసులకు పంపడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉందని హెచ్చరించారు.

**కార్మికులకు సీపీఐ మద్దతు:**

ఈ ఆందోళనకు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా సంఘీభావం ప్రకటించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. డిపో మేనేజర్ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, ఒక డ్రైవర్‌పై ఇన్ని పనులు పెట్టడం సరికాదని అన్నారు. హైదరాబాద్, విశాఖపట్నం, కాకినాడ వంటి సుదూర సర్వీసులకు కండక్టర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. ఆర్.ఎం. ఈ విషయంపై స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శులు కందుల భాస్కర్, జి.ఎస్. నారాయణ, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రావులపల్లి రవికుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి కంభం మెట్టు శ్రీనివాస్, ఇతర నాయకులు, ఆర్టీసీ టీం డ్రైవర్లు పాల్గొన్నారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తామని కార్మికులు తేల్చి చెప్పారు.

# మేనత్తను గొడ్డలితో నరికి చంపిన వ్యక్తి అరెస్ట్

- డబ్బులు, బంగారం కోసమే హత్య.. 24 గంటల్లోనే కేసు ఛేదించిన పోలీసులు
- నిందితుని వివరాలు వెల్లడించిన అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ గౌష్ ఆలం
- అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ముందు నిందితున్ని హాజరు పరిచారు



**వెంకటాపురం సెప్టెంబర్ 12 నుగూరు (డిడి 9 వార్త):**

వెంకటాపురం మండలంలోని వి.ఆర్.కె.పురం గ్రామంలో ఇటీవల జరిగిన దారుణ హత్య కేసులో పోలీసులు నిందితుడిని 24 గంటల్లోనే అరెస్టు చేశారు. డబ్బులు, బంగారం కోసం మేనత్తను దారుణంగా హత్య చేసిన కొండగొర్ల విజయ్ కుమార్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించారు.

**ఘటన వివరాలు:**

వెంకటాపురం మండలం, వి.ఆర్.కె.పురం గ్రామానికి చెందిన కొండగొర్ల విజయ్ కుమార్ (30), మద్యానికి, జల్సాలకు అలవాటు పడి ఖాళీగా తిరిగేవాడు. అతడు తన మేనత్త కొండగొర్ల ఎల్లమ్మ (65) వద్దకు తరచూ డబ్బులు, బంగారం కోసం వెళ్లేవాడు. ఆమె గతంలో చాలాసార్లు డబ్బులు ఇచ్చినా, ఇటీవల నిరాకరించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలోనే వారి మధ్య గొడవలు జరిగాయి. సెప్టెంబర్ 10వ తేదీన రాత్రి, విజయ్ తన మేనత్త ఇంటికి వెళ్లి డబ్బులు, బంగారం అడగగా ఆమె నిరాకరించడంతో గొడవ పడ్డాడు. ఆ సమయంలో అడ్డుపడిన ఆమె చెల్లెలు కుమారుడిపై కూడా దాడి చేసి పారిపోయాడు. భయపడిన మృతురాలు ఎల్లమ్మ తన బంధువుల ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు, సెప్టెంబర్ 11న, కూరగాయలు కొనడానికి వి.ఆర్.కె.పురం మెయిన్ రోడ్డుకు రాగా, నిందితుడు విజయ్ ఆమెను వెంబడించాడు. ఇప్పలగూడెం సీసీ రోడ్డు వద్ద గొడ్డలితో ఆమె తలపై నరికి దారుణంగా హత్య చేశాడు. ఎల్లమ్మ అక్కడికక్కడే కుప్పకూలిపోయారు.

**నిందితుడి పట్టివేత:**

ఈ ఘటనపై వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడు వి.ఆర్.కె.పురం గ్రామంలోని తన ఇంటి వద్ద ఉన్నాడన్న పక్కా సమాచారంతో, వెంకటాపురం సీఐ ఆఫ్ పోలీస్, ఎస్ఐ మరియు సిబ్బందితో కలిసి ఈరోజు ఉదయం అతడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితుడు విజయ్ కుమార్ తన నేరం ఒప్పుకున్నాడు. హత్యకు ఉపయోగించిన గొడ్డలిని మరియు తన తండ్రి ఫోటోను ఒక వేప చెట్టు కింద దాచిపెట్టానని తెలిపాడు. పోలీసులు ఇద్దరు ప్రభుత్వ అధికారులను పంచులుగా నియమించి, వారి సమక్షంలో నిందితుడు చూపించిన స్థలం నుండి గొడ్డలి, ఫోటోను స్వాధీనం చేసుకున్నారు. హత్య కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించి నిందితుడిని పట్టుకున్న సీఐ, ఎస్ఐ మరియు పోలీసు సిబ్బందిని ఏటూరునాగారం అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ,ఉన్నతాధికారులు అభినందించారు. అనంతరం నిందితుడిని జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించారు..

# ప్రభుత్వ ఐటీఐలో వాక్ ఇన్ అడ్మిషన్

**భద్రాచలం, సెప్టెంబర్ 12 (డిడి9 వార్త):**

భద్రాచలం, కృష్ణసాగర్‌లోని ప్రభుత్వ ఆర్ఐటీఐ & ఏటీసీలో 202526 సెషన్ కోసం మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయడానికి 'వాక్ ఇన్ అడ్మిషన్' ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపాల్ ధర్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు.

సెప్టెంబర్ 15 నుండి 30వ తేదీ వరకు, మొదటి, రెండవ, మూడవ విడత కౌన్సిలింగ్‌లలో మిగిలిపోయిన సీట్ల కోసం ఈ వాక్ ఇన్ అడ్మిషన్లు జరుగుతాయి. అర్హులైన విద్యార్థులు NCVT ప్యాటర్న్ క్రింద వివిధ ఇంజినీరింగ్, నాన్‌ఇంజినీరింగ్ ఐటీఐ & ఏటీసీ ట్రేడ్స్‌లో శిక్షణ పొందడానికి అవకాశం ఉంది.

ఆసక్తి గల విద్యార్థులు https://iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. సెప్టెంబర్ 15 నుండి 30 వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు వాక్ ఇన్ అడ్మిషన్ కౌన్సిలింగ్ జరుగుతుంది.



విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో (ఎస్ఎస్‌సీ లాంగ్ మెమో, కుల ధ్రువీకరణ పత్రం, 1 నుండి 10వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, టీసీ) కళాశాలకు హాజరు కావాలి. హాజరైన అభ్యర్థులకు మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయించబడతాయని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నవారు మళ్ళీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదని, కొత్త అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# గిరిజన అభివృద్ధి 2047

- భద్రాద్రి ఐటీడీఏ కృషి – జాతీయ సదస్సులో ప్రత్యేక ప్రాధాన్యం
- జాతీయ సదస్సులో పాల్గొన్న భద్రాద్రి కొత్తగూడెం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి

**న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 12:**

భారత రాష్ట్రపతి ఆదేశాల మేరకు గిరిజన అభివృద్ధి 2047 దృష్టి కోణంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న కార్యక్రమాల సమీక్ష, భవిష్యత్తు రోడ్‌మ్యాప్ రూపకల్పన కోసం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జరిగిన మంత్రిత్వ శాఖ జాతీయ సదస్సు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సదస్సులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ పాల్గొని, ఏజెన్సీ ప్రాంతాల్లో అమలవుతున్న పథకాల ప్రగతిని వివరించారు.

**భద్రాద్రి ఏజెన్సీ ప్రాధాన్యం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 19 మారుమూల మండలాలు, 130 గ్రామాలు గిరిజన జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లో గిరిజనుల సమగ్ర అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. బి. రాహుల్ సదస్సులో మాట్లాడుతూ, "ఆది కర్మయోగి అభియాన్, దర్తీ ఆబా జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్, పీఎం జన్మన్, అటవీ హక్కుల చట్టం అమలు వంటి పథకాల ద్వారా గ్రామస్థాయి మార్పు తీసుకువస్తున్నాం. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుతున్నాం" అన్నారు.

**పోడు పట్టాల పంపిణీ – జీవనోపాధి దిశగా ముందడుగు**

గిరిజన రైతుల పాత డిమాండ్ అయిన పోడు పట్టాల పంపిణీకి ఐటీడీఏ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన వెల్లడించారు. ఈ చర్య ద్వారా గిరిజన రైతులు భూమి హక్కులు పొందుతూ, పంటలపై పెట్టుబడులు పెట్టగలుగుతున్నారు. ఇది వారి జీవనోపాధి స్థిరత్వానికి తోడ్పడుతుందని రాహుల్ చెప్పారు.

**శిక్షణ – అవగాహన కార్యక్రమాలు**

గ్రామ స్థాయిలో డిఎంటి, బిఎంటి శిక్షకులకు శిక్షణ ఇచ్చి, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యక్షంగా గ్రామసభలకు హాజరై, సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతను పాటిస్తున్నారని వివరించారు.

**గిరిజన మ్యూజియం ప్రత్యేకత**

భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియం గిరిజనుల సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని బి. రాహుల్ పేర్కొన్నారు. ఈ మ్యూజియంలో గిరిజనుల ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానం ప్రదర్శనకు ఉంచి భవిష్యత్ తరాలకు జ్ఞాపకంగా నిలిపే ప్రయత్నం జరుగుతోందని చెప్పారు. మ్యూజియం కాపీ బుక్‌ను కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అందజేశారు.

**దేశవ్యాప్తంగా చర్చించిన అంశాలు**

ఈ సదస్సులో వివిధ రాష్ట్రాల ప్రిన్సిపాల్ సెక్రటరీలు, ఐటీడీఏ అధికారులు పాల్గొని గిరిజన సంక్షేమానికి సంబంధించి మౌలిక వసతులు, విద్య, ఆరోగ్యం, అటవీ హక్కులు, జీవనోపాధి అవకాశాలు వంటి అంశాలపై చర్చించారు. భవిష్యత్తులో 2047 నాటికి గిరిజన ప్రాంతాలు సమగ్ర అభివృద్ధి సాధించేందుకు సమన్వయ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.










# డైలీ వేజ్ వర్కర్ల నిరవధిక సమ్మె

- **కార్మికులందరినీ పర్మినెంట్ టైం స్కేల్‌లోకి మార్చాలి.**
- **ప్రభుత్వంపై కార్మికుల ఆగ్రహం**

**భద్రాచలం సెప్టెంబర్ 12 డిడి 9 వార్త :**

తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్, కంటినిజెంట్ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీ వేజ్ మరియు ఔట్‌సోర్సింగ్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం ప్రాంతాల్లో శుక్రవారం ఈ సమ్మె తీవ్ర రూపం దాల్చింది.

**భద్రాచలంలో రిలే నిరాహార దీక్షలు:**

భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయం వద్ద గత 12 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ డైలీ వేజ్ వర్కర్స్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి హీరాలాల్ మాట్లాడుతూ, ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు.

**వారి ప్రధాన డిమాండ్లు:**

కార్మికులందరినీ పర్మినెంట్ టైం స్కేల్‌లోకి మార్చాలి. అప్పటివరకు జిల్లా కలెక్టర్ గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించాలి. మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలి. ప్రస్తుతం పని చేస్తున్న అందరికీ పూర్తి వేతనం ఇవ్వాలి. ఈ కార్యక్రమంలో ఈసం శేషగిరిరావు, నిర్మల, కన్నప్ప రాజు, సావిత్రి, శిరీష, అన్నపూర్ణ, రమాదేవి, నాగేశ్వరరావు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

**చర్లలో గిరిజన కార్మికుల ఆందోళన:**

చర్లలో జరిగిన నిరవధిక సమ్మెలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మరియు హాస్టల్ డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె. బ్రహ్మచారి మాట్లాడుతూ, ప్రభుత్వం గిరిజన కార్మికుల పొట్ట కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డైలీ వేజ్ వర్కర్ల వేతనాలు తగ్గించే జీవో 64ను, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల వేతనాలు తగ్గించే జీవో 527ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డైలీ వేజ్ వర్కర్లకు ఆరు నెలల బకాయిలు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు 10 నెలల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. గతంలో రూ. 26 వేలు వేతనం పొందుతున్న డైలీ వేజ్ వర్కర్లకు దాన్ని రూ. 11,700కు తగ్గించడం దారుణమని విమర్శించారు. మంత్రి స్థాయిలో చర్చలు జరిపినా సమస్యలు పరిష్కారం కాలేదని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి పోటీ కార్మికులను పెడితే పోరాటం తీవ్రతరం అవుతుందని హెచ్చరించారు. ఈ సమ్మెకు సీపీఎం మండల కార్యదర్శి మచ్చ రామారావు సంఘీభావం తెలిపారు.

**దుమ్ముగూడెంలో సంఘీభావం:**

దుమ్ముగూడెం మండలంలోని వివిధ గిరిజన సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కణితి రాముడు, కో కన్వీనర్ మహ్మద్ జానీ పాషా తదితర నాయకులు హామీ ఇచ్చారు. వారి పోరాటానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## భద్రాద్రిలో సెప్టెంబర్ 14న జిల్లా స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 12 (డిడి9 వార్త ):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సెప్టెంబర్ 14వ తేదీన జిల్లాస్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు ఘనంగా నిర్వహించబడనున్నాయి.

కొత్తగూడెం పట్టణంలోని కొత్తగూడెం క్లబ్‌లో పవర్ హౌస్ జిమ్ నిర్వాహకులు షమిఉద్దీన్ ఆధ్వర్యంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగనున్నాయని జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జివి రామిరెడ్డి తెలిపారు.

ఈ పోటీలను విజయవంతం చేయాలని జిల్లాలోని అన్ని జిమ్ సెంటర్ల కోచ్‌లు, జిమ్ అధినేతలు మరియు క్రీడాకారులకు ఆయన పిలుపునిచ్చారు. పోటీలో విజేతలకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేయబడతాయి. పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పించబడుతుందని తెలిపారు. పోటీలకు సంబంధించిన ఏవైనా సందేహాల కోసం జిల్లా ప్రధాన కార్యదర్శి జివి రామిరెడ్డి (ఫోన్: 9966588688)ని సంప్రదించవచ్చని వివరించారు.





## ఉపయోగం లేని వాటర్ ట్యాంక్ కూల్చివేసిన హైడ్రా

**హైదరాబాద్, సెప్టెంబర్ 12(డిడి9 వార్త):**

వెంగళరావు నగర్ లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకర్ ను హైడ్రా శుక్రవారం తొలగించింది. వెంగళరావు నగర్ డి టైప్ కాలనీలో 1974లో దీనిని నిర్మించారు. యిలా దశాబ్దాలపాటు వెంగళరావు నగర్ కాలనీ ప్రజలకు తగు నీరందించింది. అయితే మూడు దశాబ్దాలుగా వినియోగంలో లేదు. కూలడానికి సిద్ధంగా ఉంది. ఎప్పుడు ఎవరి ప్రాణాలకు ముప్పో అనేట్టు ప్రమాదకరంగా మారింది. దీనిని భద్రంగా తొలగించమని పలుమార్లు సంబంధిత అధికారులకు కాలనీ వాసులు ఫిర్యాదు చేసారు. చివరికి హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో శుక్రవారం జాగ్రత్తగా కూల్చివేసింది. ఎలాంటి ప్రమాదానికి ఆస్కారం లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంది. గురువారమే దగ్గరలో ఉన్న నివాసితులు ను అప్రమత్తం చేసి ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా కూల్చివేసింది. ఈ 200ల గజాల స్థలాన్ని ప్రజావసరాల కు వినియోగించే విధంగా చూస్తామని స్థానికులు తెలిపారు.

## యాకుత్‌పురా ఘటనకు.. బాధ్యులపై హైడ్రా చర్యలు

- **డీఆర్ ఎఫ్ సిబ్బందికి డిమోషన్**
- **మెట్ టీమ్ సభ్యుల తొలగింపు**

**హైదరాబాద్, సెప్టెంబరు 12(డిడి9 వార్త)**

పాతబస్తీలోని యాకుత్‌పురా డివిజన్ మౌలాకా చిల్లాలోని మ్యాన్ హోల్లో చిన్నారి పడిపోయిన ఘటనను హైడ్రా సీరియస్‌గా పరిగణించింది. దీనిపై హైడ్రా క్షుణ్ణంగా విచారించింది. బుధవారం సిల్ట్‌ను తొలగించడానికి తెరచిన మ్యాన్ హోల్ మూయకపోవడంతో గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న చిన్నారి అందులో పడిపోయిన విషయం విధితమే. ఈ ఘటనలో డీఆర్ ఎఫ్ సూపర్‌వైజర్లు ఇద్దరు, మెట్ (మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్స్) సిబ్బంది ఇద్దరి నిర్లక్ష్యం వల్లే జరిగిందని నిర్ధారించుకుంది. డీఆర్ ఎఫ్ సూపర్‌వైజర్లు ఇద్దరికీ డిమోషన్ యిచ్చింది. మెట్ సిబ్బందికి చెందిన ఇద్దరినీ తొలగించమని మెట్ టీమ్ కాంట్రాక్టర్ ను ఆదేశించింది.

**భవిష్యత్తులో ఇలాంటి ఘటన జరగకుండా..**

పాతబస్తీలోని మ్యాన్ హోల్ తెరచిన తర్వాత మూయకుండా వదిలేయడం పట్ల హైడ్రా బాధ్యత వహిస్తున్నట్టు కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు ప్రకటించారు. ఈ ఘటను తీవ్రంగా పరిగణించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటుకు ఆస్కారం లేకుండా శుక్రవారం అధికారులందరినీ సమావేశపరిచి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. యిదే సమయంలో అధికారులందరినీ అప్రమత్తం చేశారు. నగరంలో అన్ని క్యాచ్‌పిట్లపైనా మ్యాన్ హోల్ మూతలుండేలా చూడాలన్నారు. ఒక వేళ ఎక్కడైనా లేకుంటే.. సంబంధిత శాఖలైన జీ హెచ్ ఎంసీ, జలమండలి అధికారులతో సంప్రదించి వాటిపై మూతలు వేసేలా చర్యలు తీసుకోమని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాటు జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. ఒక వేళ ఎక్కడైనా పొరపాటున మ్యాన్ హోల్ మూత తెరచి ఉంటే.. ఆ సమాచారాన్ని 9000113667 నంబరుకు ఫోను ద్వారా తెలియజేయాలని నగర ప్రజలను కోరారు.